## 10వ అధ్యాయం

## ١٠ - بَابُ الْحَيْضِ

## రుతుస్రావానికి సంబంధించిన ఆదేశాలు

118. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా తెలిపారు: "ఫాతిమా బిన్తె హుబైష్ (ر.అన్హా) కు నిరంతరం 'ఇస్తెహాజా'

(١١٨) عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: إِنَّ فَاطِمَةَ بِنْتَ أَبِي حُبَيْشٍ كَانَتْ

تُسْتَحَاضُ، فَقَالَ لَهَا رَسُولُ اللهِ ﷺ: «إِنَّ دَمَ الْحَيْضِ دَمٌ أَسْوَدُ يُعْرَفُ، فَإِذَا كَانَ ذَلِكَ فَأَمْسِكِي عَنِ الصَّلَاةِ، فَإِذَا كَانَ الْآخَرُ فَتَوَضَّئِي وَصَلِّي». رَوَاهُ أَبُو دَاوُدَ وَالنَّسَائِيُّ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ وَالْحَاكِمُ، وَاسْتَنْكَرَهُ أَبُو حَاتِمٍ.

రక్తం స్రవించేది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు ఇలా ఉద్బోధించారు - "రుతుస్రావపు రక్తం నల్లగా (చిక్కగా) ఉంటుంది. దాన్ని తేలిగ్గా గుర్తుపట్టవచ్చు. ఏఏ రోజుల్లో ఇలాంటి రక్తం వస్తుందో ఆ రోజుల్లో నమాజ్‌ను మానివెయ్యి. వేరే రంగు ఉన్నప్పుడు 'వుజూ' చేసి నమాజ్ చేస్తూ ఉండు." (అబూదావూద్, నసాయి దీనిని ఉల్లేఖించారు. ఇబ్నె హిబ్బాన్, హాకిమ్‌లు దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. అబూ హాతిమ్ దృష్టిలో ఇది నిరుపయోగమైనది).

وَفِي حَدِيثِ أَسْمَاءَ بِنْتِ عُمَيْسٍ عِنْدَ أَبِي دَاوُدَ: وَلْتَجْلِسْ فِي مِرْكَنٍ، فَإِذَا رَأَتْ صُفْرَةً فَوْقَ الْمَاءِ فَلْتَغْتَسِلْ لِلظُّهْرِ وَالْعَصْرِ غُسْلاً وَاحِداً، وَتَغْتَسِلُ لِلْمَغْرِبِ وَالْعِشَاءِ غُسْلاً وَاحِداً، وَتَغْتَسِلُ لِلْفَجْرِ غُسْلاً وَاحِداً، وَتَتَوَضَّأُ فِي مَا بَيْنَ ذَلِكَ.

అబూ దావూద్ చేత ఉల్లేఖించబడిన అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్హా) హదీసులో ఇలా ఉంది: ఒక తొట్టిలో కూర్చోవాలి. అప్పుడు నీటి పై భాగంలో కుంకుమ పువ్వు రంగు కనిపిస్తే జుహ్ర్ మరియు అస్ర్ నమాజుల కోసం ఒకసారి స్నానం చేయాలి. అలాగే మగ్రిబ్ మరియు ఇషా నమాజుల కోసం స్నానం చేయాలి. మరియు ఫజ్ర్ నమాజ్ కోసం వేరుగా స్నానం చేయాలి. ఈ నమాజుల కోసం వుజూ చేయాలి."

## సారాంశం

పడుచు స్త్రీ మూడు రకాల రక్త స్రావాలకు లోనవుతుంది. ఒకటి: బహిష్టు రక్త స్రావం. దీనిని అరబీలో 'హైజ్' అని అంటారు. రెండు : పురిటి రక్తస్రావం (దీనిని అరబీలో దమె నిఫాస్‌గా వ్యవహరిస్తారు. ప్రసవించిన నాటి నుంచి సుమారు 40 రోజుల వరకూ ఈ రక్త స్రావం జరుగుతుంది). మూడు : దమె ఇస్తెహాజా. రుతుస్రావం మరియు పురిటి రక్త స్రావం జరిగే రోజుల్లోనే గాక ఇతర దినాలలో కూడా బ్లీడింగ్ అవుతున్నట్లయితే దీనిని 'ఇస్తెహాజా' రక్తంగా వ్యవహరిస్తారు.

బహిష్టు రక్త స్రావం కనీస గడువు ఇమామ్ షాఫయి దృష్టిలో ఒక రోజు. గరిష్ఠ వ్యవధి 15 రోజులు. మూడు రోజుల నుంచి పదిరోజుల వరకు ఈ రుతుస్రావం ఉంటుందని ఇమామ్ అబూ హనీఫా భావిస్తున్నారు. దేశ, కాల పరిస్థితుల దృష్ట్యా, స్త్రీల ఆరోగ్య ప్రమాణాల రీత్యా ఇద్దరు ఇమాముల అభిప్రాయాలూ తమ తమ కోణాలనుంచి సరైనవే కావచ్చు. అయితే ప్రతి స్త్రీ స్వానుభవం మరియు తన స్వభావం దృష్ట్యా తన 'పీరియడ్' ఎన్నాళ్ళుంటుందో తాను స్వయంగా - సరిగ్గానే -అంచనా వేయగలదు. అంతకు మించి కూడా బ్లీడింగ్ అవుతుంటే అది 'ఇస్తెహాజా' రక్తంగా భావించి తదనుగుణంగా ఆచరించాలి.

## హదీసు ఉల్లేఖకులు

హదీసును అందజేసిన అస్మా బిన్తె ఉమైస్ (ర.అన్హా) హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ (రజి) సతీమణి. ఈమె తన భర్తతో కలసి అబిసీనియాకు హిజ్రత్ చేశారు. అక్కడామెకు దేవుడు సంతాన భాగ్యం కలుగజేశాడు. అబ్దుల్లాహ్ అనే అబ్బాయి పుట్టాడు. మౌతా యుద్ధంలో ఈమె భర్త మరణించిన పిదప హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఈమెను తన దాంపత్య జీవితంలోకి తెచ్చుకున్నారు. తరువాత ఈమెకు మరో పిల్లవాడు పుట్టాడు. ఈ అబ్బాయే ముహమ్మద్ బిన్ అబూబక్ర్‌గా ప్రసిద్ధిచెందాడు. హజ్రత్ అబూబక్ర్ (రజి) మరణానంతరం హజ్రత్ అలీ (రజి) ఈమెను వివాహమాడారు. ఇప్పుడీ దంపతులకు యహ్యా అనే అబ్బాయి పుట్టాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఈమెను కలల భావార్థం అడిగి తెలుసుకునేవారు. హజ్రత్ అలీ (రజి) మరణానంతరం ఈమె కూడా కన్నుమూశారు.

(١١٩) وَعَنْ حَمْنَةَ بِنْتِ جَحْشٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُنْتُ أُسْتَحَاضُ حَيْضَةً كَثِيرَةً شَدِيدَةً، فَأَتَيْتُ النَّبِيَّ ﷺ أَسْتَفْتِيهِ، فَقَالَ: «إِنَّمَا هِيَ رَكْضَةٌ مِنَ الشَّيْطَانِ، فَتَحَيَّضِي سِتَّةَ أَيَّامٍ أَوْ سَبْعَةَ أَيَّامٍ، ثُمَّ اغْتَسِلِي، فَإِذَا اسْتَنْقَأْتِ فَصَلِّي أَرْبَعَةً وَعِشْرِينَ أَوْ ثَلَاثَةً وَعِشْرِينَ، وَصُومِي

119. హజ్రత్ హమ్నా బిన్తె జహష్ (ర.అన్హా) ఇలా తెలిపారు: నేను తీవ్రమయిన రక్త స్రావానికి (బ్లీడింగ్‌కి) లోనై ఉండేదానిని. ఈ విషయమై దైవప్రవక్త (సఅసం) అభిప్రాయం ఏమిటో కనుక్కుందామని వెళ్ళాను. ఆయన (సఅసం) ఇలా చెప్పారు - "ఇది షైతాన్ దెబ్బ. కనుక నీవు ఆరు లేక ఏడు దినాలు బహిష్టు కాలంగా లెక్కించి స్నానం చెయ్యి. నీవు పూర్తిగా పరిశుద్ధత నొందిన మీదట ఇరవైనాలుగు లేక ఇరవై మూడు రోజుల వరకూ నమాజ్ చెయ్యి. ఉపవాసవ్రతం కూడా (ఈ దినాలలో) పాటించు. నిశ్చయంగా నీ కొరకు ఇది చాలు. నెల నెలా ఇతర బహిష్టు స్త్రీల వలెనే నువ్వు కూడా ఇలాగే

وَصَلِّي، فَإِنَّ ذَلِكَ يُجْزِئُكِ، وَكَذَلِكَ فَافْعَلِي كُلَّ شَهْرٍ، كَمَا تَحِيضُ النِّسَاءُ، فَإِنْ قَوِيتِ عَلَى أَنْ تُؤَخِّرِي الظُّهْرَ وَتُعَجِّلِي العَصْرَ، ثُمَّ تَغْتَسِلِي حِينَ تَطْهُرِينَ، وَتُصَلِّينَ الظُّهْرَ وَالعَصْرَ جَمِيعاً، ثُمَّ تُؤَخِّرِينَ الْمَغْرِبَ وَتُعَجِّلِينَ العِشَاءَ، ثُمَّ تَغْتَسِلِينَ وَتَجْمَعِينَ بَيْنَ الصَّلاَتَيْنِ، فَافْعَلِي، وَتَغْتَسِلِينَ مَعَ الصُّبْحِ وَتُصَلِّينَ، قَالَ: وَهُوَ أَعْجَبُ الأَمْرَيْنِ إِلَيَّ». رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيُّ، وَصَحَّحَهُ التِّرْمِذِيُّ، وَحَسَّنَهُ الْبُخَارِيُّ.

చేస్తూ ఉండు. (ఇలా వద్దనుకుంటే) నీలో గనక జుహ్ర్ వేళను కాస్త ఆలస్యం చేసి అస్ర్ వేళను కాస్త ఇవతలకు జరుపుకునే శక్తి ఉన్నట్లయితే స్నానం చేసి పరిశుద్ధత నొందిన పిదప జుహ్ర్-అస్ర్ నమాజులను కలుపుకో. మరి అలాగే మగ్రిబ్ నమాజును కాస్సేపు వాయిదా వేసి ఇషా నమాజును కాస్త ఇవతలకు జరుపుకుని స్నానం చేసి పరిశుద్ధతను పొందు. రెండు నమాజులనూ కలుపుకో. నువ్విలా చేయవచ్చు. (ఈ మేరకు నీకు అనుమతి ఉంది). ఫజ్ర్ నమాజ్ కోసం వేరుగా స్నానం చేసి నమాజ్ చెయ్యి. తరువాత ఆయన (స) ఇలా అన్నారు - "ఈ రెండు పద్ధతులలో రెండవదే నాకు ఇష్టమైనది" (దీనిని 'ఐదుగురి'లో నసాయి మినహా మిగిలిన వారంతా ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. బుఖారీ దీనిని 'సుస్పష్టం'గా పేర్కొన్నారు).

## సారాంశం

ఈ హదీసులో హమ్నా బిన్తె జహష్‌కు రేయింబవళ్ళలో మూడుసార్లు స్నానం చేయాలని సూచించబడింది. జుహ్ర్ - అస్ర్ నమాజుల కోసం ఒక స్నానం, మగ్రిబ్ - ఇషా నమాజుల కోసం ఒక స్నానం, ఫజ్ర్ నమాజ్ కోసం ఒక స్నానం. ఇంతకు ముందు వచ్చిన హదీసులో ఫాతిమా బిన్తె హుబైష్‌కు - ప్రతి నమాజు కోసం వుజూ చేయాలని ఆజ్ఞాపించబడింది. దీనిద్వారా స్పష్టంగా బోధపడేదేమంటే నిరంతర బ్లీడింగ్ వ్యాధికి లోనైవున్న స్త్రీ ప్రతి నమాజు కోసం స్నానం చేయటం తప్పనిసరి కాదు గాని ప్రతి నమాజు కోసం సరికొత్తగా వుజూ చేయటం తప్పనిసరి. స్నానం అభిలషణీయం మాత్రమే. అది కూడా ఆరోగ్య, వాతావరణ స్థితిగతులు అనుకూలిస్తేనే. లేకుంటే స్నానం కూడా చేయవలసిన అవసరం లేదు.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన హమ్నా బిన్తె జహష్ (ర.అన్హా) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్

జైనబ్ బిన్తె జహష్ (ర.అన్హా) సోదరి. తొలుత ఈమె ముస్లైబ్ బిన్ ఉమైర్ (రజి)కు సతీమణిగా ఉన్నారు. ఉహుద్ యుద్ధంలో ముస్లైబ్ అమరగతి నొందగా తల్హా బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఈమెను నికాహ్ చేసుకున్నారు.

(١٢٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا أَنَّ أُمَّ حَبِيبَةَ بِنْتَ جَحْشٍ شَكَتْ إِلَى رَسُولِ اللّٰهِ ﷺ الدَّمَ، فَقَالَ: «امْكُثِي قَدْرَ مَا كَانَتْ تَحْبِسُكِ حَيْضَتُكِ، ثُمَّ اغْتَسِلِي»، وَكَانَتْ تَغْتَسِلُ لِكُلِّ صَلاَةٍ. رواه مسلم.

120. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: హజ్రత్ ఉమ్మె హబీబా (ర.అన్హా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి 'దమె ఇస్తిహాజా' (బ్లీడింగ్) గురించి ఫిర్యాదు చేసింది. దానికి ఆయన (స) ఇలా సెలవిచ్చారు - "నీ నెలవారీ దినాలు లోగడ ఎన్ని నిర్ధారితమయి ఉండేవో అన్ని దినాలూ (నమాజ్, రోజా) వది లెయ్యి. ఆ తరువాత స్నానం చేసి నమాజ్ విధిని నెరవేర్చు." ఉమ్మె హబీబా ఆ తరువాత ప్రతి నమాజ్కై తాజాగా స్నానం చేసేది. (ముస్లిం)

وَفِي رِوَايَةِ الْبُخَارِيِّ «وَتَوَضَّئِي لِكُلِّ صَلاَةٍ». وَهِيَ لأَبِي دَاوُدَ وَغَيْرِهِ مِنْ وَجْهٍ آخَرَ.

కాగా; బుఖారీ ఉల్లేఖనంలో ఈ విధంగా ఉంది: "మరి ప్రతి నమాజ్ కోసం సరికొత్తగా వుజూ చేస్తూ ఉండు." (అబూ దావూద్ తదితర హదీసువేత్తలు ఈ హదీసును మరో విధంగా ఉల్లేఖిం చారు).

## సారాంశం

ఈ హదీసు ద్వారాగానీ, ఈ అధ్యాయం క్రింద వచ్చిన ఇతర హదీసుల ద్వారాగానీ అవగత మయ్యేదేమిటంటే దీర్ఘకాలంగా బ్లీడింగ్ వ్యాధితో బాధపడే మహిళ బహిష్టు రక్తానికీ - సాధారణ బ్లీడింగ్కి మధ్య వున్న వ్యత్యాసాన్ని గ్రహించే ఆనవాళ్లు కొన్ని ఉన్నాయి. అనుభవం, విచక్షణా జ్ఞానంగల మహిళ ఈ తేడాను ఇట్టే పసిగట్టగలుగుతుంది. బహిష్టు కాలపు రక్తం చిక్కగా, నలుపు ఆవరించి ఉంటుంది. వాసన కూడా భరించశక్యం కానిదిగా ఉంటుంది. కాగా; ఇస్తెహాజా (సాధారణ బ్లీడింగ్) రక్తం లేత ఎరుపురంగు కలిగి ఉంటుంది. ఒక్కోసారి కుంకుమ పువ్వు రంగులో కనిపిస్తుంది. పల్చగా ఉంటుంది. అదీగాక ఒక స్త్రీకి తనకు సాధారణంగా - లోగడ ఎన్ని రోజులు బహిష్టు రక్తం పోయేదో - లెక్క ఉంటుంది. ఆ లెక్క ప్రకారం కూడా ఆమె తన పీరియడ్ను అంచనా వేయగలదు. లేక తన సమ వయస్కులైన, తన స్వభావానికి అనుగుణమైన స్త్రీలకు ఎన్ని రోజులు రుతుస్రావం జరుగుతుందో తెలుసుకుని కూడా 'పీరియడ్'ను లెక్కించవచ్చు.

హజ్రత్ ఉమ్మె హబీబా (ర.అన్హా) ప్రతి నమాజుకై స్నానం చేసేవారు. ఈ స్నానం ఆమె తన శక్తీ స్థోమతలనుబట్టి చేశారేతప్ప ప్రతి నమాజు కోసం సరికొత్తగా స్నానం చేయటం తప్పనిసరి కాదు. పండితులలో అధిక సంఖ్యాకుల అభిప్రాయం ఇదే. ఇస్తెహాజా వ్యాధికి లోనైన స్త్రీపై షరీయత్ ప్రతి నమాజు కోసం స్నానం చేయాల్సిందేనన్న నియమం పెట్టలేదు. 'ఫత్హుల్ బారీ' లో అల్లామా ఇబ్నె హజర్ అస్ఖలానీ (రహ్మ.లై) కూడా ఈ అభిప్రాయాన్నే సమర్థించారు. ఇమామ్ షౌకానీ (రహ్మ.లై) కూడా దీనినే సమర్థించారు. బ్లీడింగ్‌తో సతమతమయ్యే మహిళలపై ప్రతి నమాజు కోసం సరికొత్తగా స్నానం చేసే భారం సహీహ్ హదీసుల ద్వారా నిరూపితం కాలేదంటా రాయన. ఇలాంటి స్త్రీ బహిష్టు కాలం పూర్తయిన పిదప స్నానంచేసి, ఆ తరువాత ప్రతి నమాజ్ కోసం ఇస్తింజా చేసి వుజూ చేసుకుంటే సరిపోతుంది.

## హదీసు ఉల్లేఖకులు

ఈ హదీసును ఉల్లేఖించిన ఉమ్మె హబీబా బిన్తె జహష్ (ర.అన్హా) హమ్నా బిన్తె జహష్ (ర.అన్హా) కు తోబుట్టువు. ఈమె అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) సతీమణి. ముస్లింలోని ఉల్లేఖనం ప్రకారం ఈమె నిరంతరం ఏడు సంవత్సరాలు బ్లీడింగ్‌తో బాధపడ్డారని తెలుస్తోంది. హిజ్రీ 44లో ఈమె మరణించారు. కొంతమంది వాదన ప్రకారం జహష్‌కు ముగ్గురు కుమార్తెలు. ముగ్గురూ 'ఇస్తె హాజా' వ్యాధిగ్రస్తులే. ఈ ముగ్గురిలో ఒకరు: ఉమ్ముల్ మోమినీన్ జైనబ్, రెండవవారు: హమ్నా. మూడవవారు: ఉమ్మె హబీబా. కాని నిజమేమిటంటే హజ్రత్ జైనబ్ (ర.అన్హా) ఈ వ్యాధినుండి సురక్షితంగా ఉన్నారు. దైవప్రవక్త (సఅసం) కాలంలో పదిమంది మహిళలు 'ఇస్తెహాజా' వ్యాధికి లోనై ఉండేవారని ప్రతీతి.

(١٢١) وَعَنْ أُمِّ عَطِيَّةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كُنَّا لاَ نَعُدُّ الْكُدْرَةَ وَالصُّفْرَةَ بَعْدَ الطُّهْرِ شَيْئاً. رَوَاهُ الْبُخَارِيُّ وَأَبُو دَاوُدَ، وَاللَّفْظُ لَهُ.

121. హజ్రత్ ఉమ్మె అతియ (ర.అన్హా) వివరించారు: మేము (రుతుస్రావ కాలం ముగిసిన తరువాత) స్నానాదులు చేసి పరిశుద్ధత పొందేవారం. ఆ తరువాత (స్రవించే) జిగటు మరియు పసుపు పచ్చని రంగుగల పదార్థానికి ప్రాధాన్యత నిచ్చే వారము కాము. (అంటే ఆ పదార్థం స్రవిస్తే దాన్ని రుతుస్రావంగా తలపోసే వాళ్ళం కాము). (బుఖారీ, అబూదావూద్ - హదీసు పదాలు మాత్రం అబూ దావూద్‌లోనివి).

## సారాంశం

బహిష్టు కాలం ముగిసిన తరువాత కనిపించే మైల మరియు పసుపుపచ్చని డిశ్చార్జ్‌ని తాము 'బహిష్టు రక్తం' గా ఎన్నటికీ భావించేవారం కాదు అని భావం.

ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనం ప్రకారం పసుపుపచ్చని రంగులో స్రవించే నీరును రుతుస్రావంగా తలపోసే వారని తెలిసింది. కాని ఈ హదీసులో 'ఇలాంటి నీరుకు మేము ప్రాధాన్యతనిచ్చే వాళ్లం కాదు' అని చెప్పబడింది. పైకి ఈ రెండు హదీసులలో వైరుధ్యం కనిపిస్తున్నప్పటికీ, కాస్త నిశితంగా ఆలోచిస్తే ఈ వ్యాఘాతం సమసిపోగలదు. పైన పేర్కొనబడిన రంగుగల నీరు ఒకవేళ రుతుస్రావ సమయంలో కనిపిస్తే దాన్ని రుతుస్రావంగానే భావించవచ్చు. ఒకవేళ పీరియడ్ గడచిన తరువాత కనిపిస్తే దానికి ప్రాముఖ్యత ఇవ్వవలసిన అవసరం లేదని అనుకోవచ్చు. హదీసులో వచ్చిన 'బాదుత్తుహర్' అనే పదం సూచిస్తున్నది కూడా ఇదే.

## హదీసు ఉల్లేఖకులు

ఉమ్మె అతియా (ర.అన్హా) అసలు పేరు నుసైబా. కాబ్ కుమార్తె. ఈమె హారిస్ పుత్రిక అని కూడా ఒక వాదన ఉంది. ఈమె గొప్ప స్థానం పొందిన సహాబియాత్‌లలో ఒకరుగా ప్రసిద్ధికెక్కారు. యుద్ధ సమయంలో దైవప్రవక్త (స) కు తోడుగా ఉండేవారు. రోగగ్రస్తులకు సేవలందించేవారు. క్షతగాత్రులకు కట్లుకట్టేవారు. ఉహుద్ యుద్ధంలో శూరులైన మగవారివలే పోరాడారు. దైవప్రవక్త (సఅసం) కుమార్తెకు (చనిపోయినపుడు) చేయించిన స్నానానికి ఆమె సాక్షిగా ఉన్నారు. ఆమె ఎంతో శుభ్రంగా ఆమెకు స్నానం చేయించారు. ఈమె బస్రాలో ఉన్న కాలంలో అక్కడి పండితులు, తాబయీన్లు ఈమె నుండి అనేక హదీసులను సంగ్రహించేవారు. ఈమె అసలు హదీసు మృతునికి చేయించే స్నానం గురించి ఉంది. బస్రాలో స్థిరపడిన కారణంగా బస్రీ సహాబియాగా పరిగణించ బడ్డారు.

(١٢٢) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ، أَنَّ الْيَهُودَ كَانُوا إِذَا حَاضَتِ الْمَرْأَةُ فِيهِمْ لَمْ يُؤَاكِلُوهَا، فَقَالَ النَّبِيُّ ﷺ: «اِصْنَعُوا كُلَّ شَيْءٍ إِلَّا النِّكَاحَ». رَوَاهُ مُسْلِمٌ.

122. హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలిపారు: యూదులలో ఏ స్త్రీకయినా బహిష్టు కాలం వస్తే వాళ్లు ఆ స్త్రీతో కలసి తినటం, త్రాగటం మానేసేవారు. అయితే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు - "(ఓ ముస్లింలారా!) మీరు ఒక్క సంభోగం తప్ప ఏ పనైనా (మీ భార్య అయిన) స్త్రీతో చేయించగలరు." (ముస్లిం)

## సారాంశం

దైవప్రవక్త (సఅసం) గారి ఉపదేశం వెలుగులో బహిష్టు కాలంలో వున్న స్త్రీతో కలసి కూర్చోవటం, పడుకోవటం, తినటం, త్రాగటం - అన్నీ ముస్లిముల కొరకు ధర్మ సమ్మతమే. కేవలం ఒక్క సంభోగానికి దూరంగా ఉండటం అవసరం. ఈ అంటరానితనం యూదులలో, హిందువులలో అధికంగా ఉంది. ముస్లిముల దృష్టిలో దీనికి ఎలాంటి ప్రాముఖ్యం లేదు.

(١٢٣) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَ رَسُولُ اللهِ ﷺ يَأْمُرُنِي فَأَتَّزِرُ، فَيُبَاشِرُنِي وَأَنَا حَائِضٌ. مُتَّفَقٌ عَلَيْهِ.

123. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వివరించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్ను లోఉడుపు గట్టిగా కట్టుకోమని చెప్పేవారు. ఆ తరువాత నన్ను హత్తుకుని పడుకునే వారు. నేనప్పుడు బహిష్టు స్థితిలో ఉండే దానిని." (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఒండొకరు హత్తుకుని పడుకోవటాన్ని అపార్థం చేసుకోనవసరం లేదు. విచారకరమైన విషయం ఏమిటంటే హదీసులను త్రోసిపుచ్చే వర్గం (మున్కిరీనె హదీస్) మహాప్రవక్త (స) వారి హదీసుల పట్ల ప్రజాబాహుళ్యంలో వెగటును పుట్టించి, అనుమానాలను రేకెత్తించే ఉద్దేశ్యంతో ఇలాంటి హదీసులను వక్రీకరిస్తుంది. ఉదాహరణకు : వారు ఈ హదీసును ఉదాహరిస్తూ దివ్య ఖుర్ఆన్‌లో వారించబడినప్పటికీ దైవప్రవక్త (సఅసం) బహిష్టు స్థితిలోవున్న తమ భార్యలతో సంభోగించే వారని (దైవం మన్నించుగాక!) అభాండం వేశారు. తత్కారణంగా హదీసులు నిజమైనవి కావని ఘోషిస్తారు. ఇవి నమ్మదగ్గ మాటలు కావు. పరస్పరం హత్తుకుని పండుకోవటమే సంభోగమని అనటం అన్యాయం కాకపోతే ఏమిటీ? బహిష్టు స్థితిలో - ఒక్క నాభిక్రింది భాగాన్ని తప్ప - స్త్రీ శరీరమంతటినీ తాకి మధురానుభూతిని పొందేందుకు షరీయత్ అనుమతిస్తోంది.

(١٢٤) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُمَا، عَنْ رَسُولِ اللهِ ﷺ، فِي الَّذِي يَأْتِي امْرَأَتَهُ وَهِيَ حَائِضٌ، قَالَ: «يَتَصَدَّقُ بِدِينَارٍ أَوْ بِنِصْفِ دِينَارٍ». رَوَاهُ الْخَمْسَةُ، وَصَحَّحَهُ الْحَاكِمُ وَابْنُ الْقَطَّانِ، وَرَجَّحَ غَيْرُهُمَا وَقْفَهُ.

124. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : తన భార్య బహిష్టు అయి వున్న స్థితిలో ఆమె వద్దకు పోయిన వ్యక్తి గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), "అతడు ఒక దీనారు లేక అర్ధ దీనారు దానం చేయాలి" అని సెల విచ్చారు. (ఈ హదీసును ఐదుగురు ఉల్లేఖించారు. హాకిమ్ మరియు ఇబ్నె ఖత్తాన్ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు. మిగిలిన హదీసువేత్తలు దీనిని 'మౌఖూఫ్'గా నిర్ధారించారు)

(١٢٥) وَعَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ:

125. హజ్రత్ అబూ సయీద్ ఖుదరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు:

«أَلَيسَ إِذَا حَاضَتِ الْمَرْأَةُ لَمْ تُصَلِّ وَلَمْ تَصُمْ؟». مُتَّفَقٌ عَلَيْهِ فِي حَدِيثٍ طَوِيلٍ.

"ఏమిటీ, స్త్రీ బహిష్టు అయి వున్నప్పుడు నమాజ్, ఉపవాసాలను విడిచిపెట్టదా?" (బుఖారీ, ముస్లిం - ఇది సుదీర్ఘమయిన హదీసులోని ఒక భాగం మాత్రమే)

**సారాంశం**

అంటే ఈ అశుద్ధావస్థలో ఆమె నమాజ్ చేయవలసిన అవసరం లేదు. ఉపవాస (రోజా) వ్రతాన్ని పూనవలసిన అవసరం కూడా లేదు. వదలివేయబడిన 'రోజా' లను ఇతర దినాలలో 'ఖజా' చేసుకోవలసి ఉంటుంది. అయితే బహిష్టు కాలంలో వదలివేసిన నమాజులను మాత్రం 'ఖజా' చేయవలసిన అవసరం లేదు.

(١٢٦) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: لَمَّا جِئْنَا سَرِفَ حِضْتُ، فَقَالَ النَّبِيُّ ﷺ: «افْعَلِي مَا يَفْعَلُ الْحَاجُّ، غَيْرَ أَنْ لاَ تَطُوفِي بِالْبَيْتِ حَتَّى تَطْهُرِي». مُتَّفَقٌ عَلَيْهِ فِي حَدِيثٍ طَوِيلٍ.

126. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) వివరించారు: "మేము 'సరిఫ్' అనే ప్రదేశానికి చేరుకునేసరికి నాకు బహిష్టు దినాలు మొదలయ్యాయి. (ఈ సంగతిని నేను తెలియజేయగా) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "ఇతర హాజీల మాదిరిగానే నీవు కూడా హజ్ ఆచారాలను నెరవేర్చు. అయితే బైతుల్లాహ్ (దైవ గృహం) ప్రదక్షిణ మాత్రం గడువు దాటిన మీదట స్నానం చేసి చెయ్యి." (బుఖారీ, ముస్లిం - ఇది కూడా సుదీర్ఘమయిన హదీసులోని ఒక భాగం మాత్రమే)

**సారాంశం**

(1). దైవప్రవక్త (స) వారి అంతిమ హజ్ యాత్ర సందర్భంగా జరిగిన సంఘటన ఇది.

(2). 'సరిఫ్' ఒక ప్రదేశం పేరు. ఇది మక్కాకు పది మైళ్ళ దూరంలో ఉంది.

(3). ఈ హదీసు ప్రకారం బహిష్టు అయివున్న స్త్రీ కాబా ప్రదక్షిణ చేయజాలదు. ఎందుకంటే ప్రదక్షిణ కోసం శుచీ శుభ్రత అవసరం. కాగా; బహిష్టు కాలంలో స్త్రీ అశుద్ధతకు లోనై ఉంటుంది. అశుద్ధావస్థకు లోనై వున్న స్త్రీ మస్జిద్‌లోనే ప్రవేశించలేనప్పుడు కాబా గృహం వద్దకు ఎలా రాగలుగుతుంది? ఈ స్థితిలో ఆమె కనీసం నమాజ్ కూడా చేయజాలదు. అందుకే రచయిత ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకుని విషయాన్ని విశదీకరించారు.

(١٢٧) وَعَنْ مُعاذِ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّهُ سَأَلَ النَّبِيَّ ﷺ، مَا يَحِلُّ لِلرَّجُلِ مِنَ امْرَأَتِهِ وَهِيَ حَائِضٌ؟ فَقَالَ: «مَا فَوْقَ الْإِزَارِ». رَوَاهُ أَبُو دَاوُدَ، وضَعَّفَهُ.

127. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) కథనం ప్రకారం ఆయన దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను, 'స్త్రీ బహిష్టు కాలంలో ఉన్నప్పుడు ఆమెకు సంబంధించిన ఏఏ వస్తువులు భర్త కొరకు ధర్మసమ్మతం అవుతాయి?' అని ప్రశ్నించగా, ఆయన (సఅసం) ఇలా బదులిచ్చారు: "పాజామా లేక ఇజారు (లేక లంగా) పరిధిలోకి వచ్చే శరీర భాగం తప్ప మిగిలినదంతా అతని కొరకు ధర్మ సమ్మతమే." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు - బలహీనమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ఈ హదీసు ద్వారా రెండు విషయాలు అర్థమవుతున్నాయి. ఒకటి: బహిష్టు దినాలలో నాభి క్రింది భాగం జోలికి పోకూడదు. అంటే రతిక్రీడలో పాల్గొనరాదు. రెండు: నిర్ణీత శరీర భాగాన్ని మినహాయించి స్త్రీ యొక్క ఇతర శరీరావయవాలను తాకవచ్చు, స్త్రీని హత్తుకుని నిద్రించవచ్చు. ఆమె వండిపెట్టిన ఆహార పదార్థాలను తినవచ్చు - ఒక్క సంభోగం తప్ప - ప్రతిదీ చేయవచ్చు.

(١٢٨) وَعَنْ أُمِّ سَلَمَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: كَانَتِ النُّفَسَاءُ تَقْعُدُ على عَهْدِ النَّبِيِّ ﷺ بَعْدَ نِفَاسِهَا أَرْبَعِينَ يَوْماً. رَوَاهُ الْخَمْسَةُ إِلاَّ النَّسَائِيَّ، وَاللَّفْظُ لِأَبِي دَاوُدَ.

128. హజ్రత్ ఉమ్మె సలమ (ర.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో స్త్రీలు ప్రసవించిన తరువాత నలభై రోజుల వరకూ అశుద్ధులుగా కూర్చుని ఉండేవారు. (నసాయితో పాటు మరో ఐదుగురు దీనిని ఉల్లేఖించారు. హదీసు పదాలు మాత్రం అబూ దావూద్ లోనివి)

وَفِي لَفْظٍ لَهُ: وَلَمْ يَأْمُرْهَا النَّبِيُّ ﷺ بِقَضَاءِ صَلاَةِ النِّفَاسِ. وَصَحَّحَهُ الْحَاكِمُ.

దీని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది: పురిటిరక్త స్రావ కాలంలో విడిచిపెట్టబడిన నమాజులను 'ఖజా' చేసుకోమని దైవప్రవక్త (సఅసం) ఆదేశించలేదు. (హాకిమ్ దీనిని ప్రామాణికంగా ఖరారు చేశారు)

## సారాంశం

ప్రసవించిన స్త్రీల అశుద్ధ గడువు 40 రోజులని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. దీని కనీస గడువు ఎంత? అనేది ఇదమిత్థంగా చెప్పబడలేదు. అయితే 40 రోజుల తరువాత కూడా పరిశుద్ధత చేకూరకపోతే దాన్ని 'ఇస్తెహాజా'గా పరిగణించవలసి ఉంటుంది.

గడువు ముగిసిన తరువాత నమాజ్, రోజాలను విడిచిపెట్టకూడదు. భర్తతో లైంగిక సంబంధం కూడా ఏర్పరచుకోవచ్చు.

బహిష్టు కాలంలో ధర్మానికి సంబంధించిన ఏ ఏ నిబంధనలున్నాయో అవే పురిటి రక్త స్రావంలోనూ ఉన్నాయి. అంటే ఈ 40 రోజుల గడువులో స్త్రీలు నమాజ్, రోజాలను విడిచిపెట్టాలి. మస్జిద్‌లో ప్రవేశించరాదు. కాబా ప్రదక్షిణ కూడా చేయకూడదు. దివ్య ఖుర్‌ఆన్‌ను ముట్టుకోవటంగానీ, పారాయణం చేయటం గానీ చేయకూడదు. ఈ గడువులో విడిచిపెట్టబడిన ఉపవాసాలను మాత్రం తరువాత ఖజా చేసుకోవాలి. నమాజులను ఖజా చేయనవసరం లేదు.